## రేపు సంగారెడ్డిలో ఉద్యోగ మేళా : ఎంపిడిఓ

**మనూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఈ నెల 20వ తారీఖున సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడులోని పాత డిఆర్‌డిఏ కార్యాలయం నందు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ షాజీలోద్దిన్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రయివేటు కర్మాగారాల్లో ఉద్యోగలు పొంది జీవనోనపాధి అందుకోవాలని సూచించారు. ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం పొందిన వారు హైద్రాబాద్‌లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని, ఫీల్డ్ సేల్స్ ఉద్యోగం కోసం 10వ తరగతి ఉత్తీర్ణులయి ఉండాలని, నెలకు 15వేల రూపాయల జీతం చెల్లించడం జరుగుతుందని, 19 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారు ఇంటర్వ్యూలు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఫీల్డ్ టెక్నీషియన్ ఉద్యోగానికి ఇంటర్‌తో పాటు ఐటిఐలో పాస్ అయి ఉండాలన్నారు. నెలకు 18వేల రూపాయల జీతం ఉంటుందన్నారు. కస్టమర్ సపోర్ట్ ఉద్యోగానికి ఇంటర్, డిగ్రీ పాసయి ఉండాలని, నెలకు 18వేల రూపాయలు అందుకుంటారన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## నేడు బిసి స్టడీ సర్కిల్ శాశ్వత భవనం ప్రారంభం

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా కేంద్రంలో బిసి స్టడీ సర్కిల్‌కు మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవతో శాశ్వత భవన నిర్మాణానికి రూ.4 కోట్ల15 లక్షల నిధులు మంజూరు వచ్చాయి. ఈనెల 21న మంత్రి చేతుల మీదుగా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. మంత్రి హరీష్‌రావు కృషితో సిద్ధిపేటలో రెండు స్టడీ సర్కిల్‌లు బిసి,ఎస్సీ స్టడీ సర్కిల్‌లు ఏర్పాటు అయ్యాయి. ఒకప్పుడు పోటీ పరీక్షలకు శిక్షణ పొందాలంటే హైదారాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి ప్రాంతాలకు డబ్బులు వృధా చేసుకొని శిక్షణ పొందే వారు గత 8 యేండ్లుగా సిద్ధిపేటలో పేద విద్యార్థులకు బిసి స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇస్తూ భోజనం పెడుతూ స్టడీ మెటీరియల్ అందజేస్తూ యువతి, యువకుల్లో అత్మ విశ్వాసం నింపుతున్నారు. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శాశ్వత భవనం నిర్మాణానికి రూ. 4 కోట్ల మంజూరు కాగా సిద్ధిపేట బిసి సమీకృత వసతి గృహం పక్కన శాశ్వత భవనం నిర్మించనున్నారు.సకల హంగులతో సదుపాయాలతో స్టడీ సర్కిల్ అధునాతనంగా నిర్మించడానికి చర్యలు చేపట్టారు.



వనదుర్గమ్మను దర్శించుకుంటున్న కలెక్టర్ రాజర్షీ షా

## వనదుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాతను సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షీ షా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌ను ఆలయ మర్యాదలతో ఆలయ కమిటి చైర్మన్ బాలాగౌడ్, ఇవుఓ సార శ్రీనివాస్‌లు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు మంత్రాలు వల్లిస్తుండగా కలెక్టర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కలెక్టర్‌కు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయ మర్యాదలతో కలెక్టర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కలెక్టర్ వెంట జడ్పీ సిఈఓ శేలేష్, ఆర్డీఓ సాయిరామ్, మిదం భగీరథ కమలాకర్, ఫిషరీస్ ఏడి రజిని, ఆలయ కమిటి చైర్మన్, ఆలయ ఇఓలు ఉన్నారు.

## ప్రజావాణి గొప్ప కార్యక్రమం : అదనపు కలెక్టర్



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణి గొప్ప కార్యక్రమని జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు నేరుగా ప్రజల సమస్యలను విని పరిష్కరించడానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి దరఖాస్తుదారులు ఎంతో అశతో కార్యాలయానికి వస్తారని వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యమన్నారు. దరఖాస్తు దారుల నుంచి తీసుకున్న ఫిరా ్యదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. దరఖాస్తు దారులకు ప్రజావాణిపై మరింత నమ్మకం పెరిగిందన్నారు. ప్రజావాణిలో 48 దరఖాస్తులు వచ్చినట్లు అయన వివరించారు. డిఅర్ఓ లక్ష్మీకిరణ్, కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై మంత్రి సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రిహరీష్‌రావు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు హైదారాబాద్‌లోన బిఅర్‌కే భవన్‌లో హైలెవెల్ సమీక్షా సోమవారం నిర్వహించారు. జిల్లాలో సిద్ధిపేట నుంచి హైదారాబాద్ వచ్చే రహదారిపై జరుగుతున్న ప్రమాదాలపై విశ్లేసించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామీణ రోడ్ల నుంచి రాష్ట్ర, జాతీయ రహదారులపై వచ్చే రూట్లతో బ్లాక్‌స్పాట్లను తెలియజేశారు. అలాగే ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య సాయం అందించే ట్రామా కేర్ సెంటర్లపై చర్చించారు.సిద్ధిపేట, గజ్వేల్ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు అసుపత్రుల సమాచారాన్ని ప్రభుత్వ పోర్టల్లో అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. నర్సాపూర్ జంక్షన్, డబుల్ బెడ్ ఇళ్ల వైపు వెళ్లే రూట్లలో సర్వీస్ రోడ్లు నిర్మించాలని మంత్రి అధికారులను అదేశించారు. సిద్ధిపేట, వంటిమామిడి జంక్షన్, ప్రజ్ఞాపూర్ జంక్షన్‌లలో స్పీడ్ ఇండికేకటర్లను ఏర్పాటు చేసి ప్రయాణీకులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్ సేప్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ శా ంతికుమారి, అర్‌అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివా స రాజు,అర్‌అండ్‌బి గణపతిరెడ్డి, ట్రాన్స్‌పోర్టు కమిషనర్, సిద్ధిపేట సీపీ శ్వేత, రోడ్డు సేప్టీ అధికారులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగు పరిశీలన

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):**
గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో రైతులు తోట రాజమణి లక్ష్మయ్య, మెతుకు మంజుల, మెతుకు శ్రీనివాస్‌లు సాగు చేస్తున్న ఆయిల్‌ఫామ్ తోటలను జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ సోమవారం పరిశీలించారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 6055 ఎకరాలలో సాగుకు ముందుకు వచ్చారని, గజ్వేల్‌లో 218 ఎకరాలలో సాగుకు ముందుకు రావడం జరిగిందని తెలిపారు. రైతులు ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ఆయిల్‌ఫామ్ సాగుకు ముందుకు రావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఏడిఏ బాబునాయక్, ఏఓ నాగరాజు, ఏఈఓలు గణేష్, జ్యోతి ఉన్నారు.



ఆయిల్‌ఫామ్‌తోటను పరిశీలిస్తున్న దృశ్యం

# రథోత్సవం నయనాందభరితం



వనదుర్గా భవాని మాతకు పూజలు చేస్తున్న దృశ్యం

### ఏడుపాయల్లో కొనసాగుతున్న జాతర ఉత్సవాలు
### అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా దేవి ఆలయం దుర్గమ్మ నామస్మరణతో మార్మోగింది. జాతర మహోత్సవంలో భాగంగా ఆనవాయితీగా నిర్వహిస్తున్న రథోత్సవాన్ని ఆలయ కమిటి చైర్మన్ బాలాగౌడ్, ఆలయ ధర్మకర్తలు, ఆలయ ఇఓ సార శ్రీనివాస్‌లు నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్ద పటేల్ ఇంటికి చేరుకుని పెద్ద పటేల్ పెద్దలచ్చన్న గారి గంగుల సాయిరెడ్డికి బొట్టు పెట్టి రథోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు. పెద్ద పటేల్ 18 మంది పనిబాటల వారికి రథోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించడంతో పనిబాటల వారు బైండ్ల వారు చప్పుళ్లతో ప్రసాదంతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి రథిని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఏర్పాటు చేసి డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు.

**బోనమెత్తిన జోగిన శామల**

వనదుర్గ భవాని మాతకు భాగ్యనగరానికి చెందిన జోగిని శ్యామల ప్రతి సంవత్సరం అమ్మవారిని దర్శించుకునేందుకు ఏడుపాయలకు రావడం ఆనవాయితీగావస్తోంది. జాతర ఉత్సవాల్లో పాల్గొన ఆదివారం రాత్రికి అమ్మవారిని దర్శించుకుని బోనమెత్తుకుని నృత్యం చేశారు. ఇదిలా ఉండగా వనదుర్గా భవాని మాతను రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి మహారాజ్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి మాధవానంద సరస్వతి ఆలయానికి చేరుకోగా ఆలయ మర్యాదలతో ఆలయ కమిటి చైర్మన్, ఇఓలు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.



ఏడుపాయల ఆలయ ఆవరణలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ఆలయ ఆవరణలో రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

### తెల్ల బంగారం సాగుతో
# నల్లబారిన రైతు బతుకులు

### దిగుబడి బాగున్నా ధర లేక రైతు దిగాలు
### నెలల తరబడి పత్తిని భద్రపర్చేందుకు రైతుకు భారం

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించని చందంగా పిత్తి రైతు పరిస్థితి మారింది. పత్తి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. తెల్ల బంగారం (పత్తి పంట) సాగుతో బతుకులు బాగుపడతాయని ఆశించిన రైతన్నల ఆశలు అడియాశలయ్యాయి. పంట దిగుబడి ఆశాజనకంగా వచ్చినా ధర లేక రైతులు దిగాలు పడుతున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు 28వేల ఎకరాల్లో ఎత్తి పంటను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల రికార్డులు ధృవీకరిస్తున్నాయి. ఒక ఎకరంలో పత్త పంటను సాగు చేయాలంటే (దుక్కి దున్నిక కాడి నుంచి పత్తి ఏరడం వరకు) ఎకరానికి 30వేల పైబడి పెట్టు బడులు పెట్టుకోవాల్సి వస్తోంది. స్వంత భూములు లేని రైతులు ఎకరానికి 25వేల రూపాయల వరకు కౌలుకు తీసుకుని పంటలను సాగు చేసుకుంటున్నారు. పంట సాగులో అతివృష్టి, అనావృష్టి మూలంగా రైతులు సాగు చేసిన పత్తి పంట సరాసరిగా ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు అధికారులు ధృవీకరిస్తున్నారు. పత్తి కోత దశలో వ్యాపారులు క్వింటాలు పత్తికి 9500 రూపాయల ధరను చెల్లించేందుకు సన్నద్ధం కావడంతో రాను రాను ధర 11వేల రూపాయల దాటం ఖాయమని ఊహించిన రైతులు పంటను అమ్ముకోలేక తమ వ్యవసాయ భూముల వద్దనే భద్రపర్చుకున్నారు. ప్రారంభంలోనే 9500 రూపాయల ధర ఉండగా రాను రాను 7500 రూపాయల కాడికి చేరుకుంది. అంతర్జాతీయ మార్కెటో దళారుల సిండికేట్‌వో తెలియదు కాని ధరలు మాత్రం ఆకాశానికి అంటకుండా పాతాళానికి పడిపోతూనే ఉన్నాయి. పంట సాగులో నిత్యం పని చేసిన రైతులు చేతికి అందిన పత్తిని ధరలేక అమ్ముకోలేక నిత్యం కావలి కాస్తూ చూసుకోవాల్సిన దయనీయ దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని చెప్పవచ్చు.



వ్యవసాయ పొలాల వద్ద భద్రపర్చుకున్న పత్తి కుప్పలు

**తగలబడి పోయిన 3వందల క్వింటాళ్ల పత్తి**

ధర కోసం ఎదురు చేస్తున్న రైతులు పత్తి పంటను తాడ్‌పత్రిల కింద కప్పి వ్యవసాయ పొలం గట్ల వద్ద భద్రపర్చుకున్నారు. మండలంలోని చినిగేపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు దాచుకున్న పత్తి పంటకు షాట్ సర్క్యూట్ మూలంగా ముగ్దురు దాచుకున్న పత్తి పంట అగ్నికి ఆహుతైన విషయం పాఠకులకు విధితమే. ధర పెరుగుతుందో లేదో తెలియక, పత్తిని భద్రపర్చుకుంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక రైతులు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి.

**రూ. 10వేలు పలికితే రైతుకు ధీమా**

భూములను కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేసిన రైతుకు ఎకరానికి 50వేల వరకు పెట్టుబడులు (ఇంట్లో వారు 4గురు పనులు చేసుకుంటే) పెట్టుకోవాల్సి వస్తోంది. ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా క్వింటాళుకు 10 వేల రూపాయల ధర పలికితే రైతుకు కొంత వరకు గిట్టుబాటు అవుతుందని చెప్పవచ్చు. రైతులు సంక్షేమమే తమ లక్ష్యమని చాటుకుంటున్న టిఆర్ఎస్ ప్రభుత్వం పత్తి రైతులను ఏ మేరకు ఆదుకుంటుందో వేచి చూడాల్సిందే.



పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం దృశ్యం

### వైభవంగా పార్వతీపరమేశ్వరుల
# కళ్యాణోత్సవం

**ఝరాసంగం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** వైభవంగా పర్వతీ పరమేశ్వర కళ్యాణమోహత్సవం కన్నుల పండువగా కొనసాగింది. మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీ కేతకి సంగ మేశ్వర స్వామి వారి ఆలయ ఆరవరణలో కొనసాగుతున్న జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం ఆలయ ఆవరణలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణాన్ని తిలకించేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు తమ కుటుంబ సభ్యులతో చేరుకుని కళ్యాణాన్ని తిలకించారు. ఆలయ పరిసరాలను భక్తులతో కిటకిటలాడాయి. కళ్యాణోత్స వాన్ని పురస్కరించుకుని స్వామి వారికి సిడిసి చైర్మన్ ఉమాకాం త్‌పాటిల్, కేతికి ఆలయ కమిటి చైర్మన్ నీల వెంకటేశంలు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు వల్లించిన వేద మంత్రోచ్చరణల మధ్య కళ్యాణం కమనీయంగా కొనసాగింది. అంతకు ముందు ఉదయం అగ్ని గుండం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆగ్నిలో నడిచి మొక్కులు చెల్లించుకున్నారు.కళ్యాణోత్సవానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ ,అన్నదానం చేశారు.

# ఘనంగా మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవాలు

### హాజరైన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

**శివ్వంపేట, ఫిబ్రవరి20 ప్రభాతవార్త:**
శివ్వంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో మల్లన్న జాతర కళ్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కళ్యాణ జాతర ఉత్సవాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది హనుమంతరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ జాతర మహోత్సవాలకు వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు మల్లన్న స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గుండ్లపల్లి గ్రామంలో మల్లన్న ఉత్సవ ఏర్పాట్లను సర్పంచి పెంజర్ల శ్రీనివాస్ యాదవ్, పెద్దగొట్టిముక్కల గ్రామంలో అక్కడి సర్పంచి చంద్రకళ శ్రీశైలం యాదవ్‌లు గ్రామస్థులతో కలిసి అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించి కళ్యాణం, జాతర ఉత్సవాలను విజయ వంతం చేశారు. ముఖ్య అతిథులను సర్పంచులు చంద్రకళ శ్రీశైలం యాదవ్, పెంజర్ల శ్రీనివాస్ యాదవ్‌లు ఘనంగా సన్మానించారు. పెద్దగొట్టిముక్కుల గ్రామంలో నిర్వహించిన అగ్నిగుండాల నిర్వహణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గుండ్లపల్లిలో నిర్వహించిన ఒగ్గు కథలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మల్లన్న దేవస్థానాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. ఈ సందర్భంగా శివ్వంపేట జెడ్పీటీసీ సభ్యులు గుండ్లపల్లి దేవాలయానికి 51 వేల రూపాయల విరాళం అందజేశారు. అదేవిధంగా పెద్దగొట్టిముక్కల దేవస్థానం వద్ద నీటి సౌకర్యం కోసం బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట సర్పంచి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు సులోచన ధర్మారెడ్డి, ఉప సర్పంచులు ఎం. నవీన్, వంచ శోభ, నాయకులు నర్సింలు, సదానందం, సత్యనారాయణ, మాజీ సర్పంచి విఠల్, నర్సారెడ్డి, వాకిటి వీరారెడ్డి, మహేష్‌గౌడ్, అంజిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, సామ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. సుదర్శన్‌గౌడ్ తన అనుచరులతో కలిసి మల్లన్న స్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. భక్తులు సర్పంచులు చంద్రకళ శ్రీశైలం యాదవ్, పెంజర్ల శ్రీనివాస్ యాదవ్‌లు అన్నదాన వితరణ ఏర్పాటు చేశారు.



ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచులు శ్రీనివాస్ యాదవ్, చంద్రకళ శ్రీశైలం యాదవ్

# కన్న కొడుకును చంపిన తండ్రి

**వర్గల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):**
మద్యానికి బానిసైన కన్న కొడుకును తండ్రి కిరాతకంగా చంపిన ఘటన వర్గల్ మండలంలోని గిర్మాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి గజ్వేల్ రూరల్ సిఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గిర్మాపూర్ గ్రామానికి చెందిన ద్యాగ జహంగీర్(42) మద్యానికి బానిసై ఖాళీ సీసాలు ఏరుకొని వచ్చే డబ్బులతో మద్యం సేవించేవాడు. ఏ పని చేయకుండా, కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్న జహంగీర్ మద్యం సేవించి ఇంటికి వచ్చి గొడవ పడేవాడు. దీంతో విసుగు చెందిన తండ్రి ద్యాగ సాయిమల్లయ్య ఈనెల 15వ తేదీన జహంగీర్ తాగివచ్చి సోయిలేకుండా ఇంట్లో పడుకున్నది చూసి కర్రతో విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో జహంగీర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన నుండి తప్పించుకోవడానికి తండ్రి సాయిమల్లయ్య పోలీసులకు కట్టుకథ చెప్పడం జరి గింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు తగు సాక్షాధారాలు సేకరించి జహంగీర్ మృతికి తండ్రి సాయిమల్లయ్యనే కారణమని గుర్తించి అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించి నట్లు సిఐ తెలిపారు.ఈ సమావేశంలో గౌరారం ఎస్ఐ సంపత్ కుమార్, సిబ్బంది ఉన్నారు.



నిందితుడిని ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న సిఐ రాజశేఖర్‌రెడ్డి

## రాధాకృష్ణ దేవాలయంలో రుద్రాభిషేకం



రాధాకృష్ణ దేవాలయంలో రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : కార్వాన్ రాంసింగ్‌పుర లోని రాధాకృష్ణ దేవాలయంలో సోమవారం శ్రీగాయత్రి పురోహిత వేద విద్యార్థుల ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకంను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం లోని శివలింగానికి పాలభిషేకం నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఈ పూజల్లో కార్వాన్ పరిసర ప్రాంతాల్లోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలన్ని భక్తులతో సందడిగా మారాయి. ప్రత్యేక పూజల్లో వేదపండితులు మార్నూరి నరసింహ్మాచార్యులు, సభాపతి గోపిరాజ్ శర్మ, సంతోష్ శర్మ, విశ్వనాథ్ శర్మ, మణిశర్మ, శరత్‌శర్మ, మజ్జనారాయణశర్మ, ఫణిశర్మ, నరేశ్‌శర్మ, శంకరదత్తశర్మ, కుటుంబ శాస్త్రీలతో పాటు దేవాలయ చైర్మన్ బాల్‌రాజ్, నాగరాజు, కుమార్, శివకుమార్, అయిందాల యాదగిరి, కత్తెర సత్యనారాయణ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి: పి.విజయారెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర నేతృత్వంలో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టిన హాత్‌సెహాత్ పాదయాత్రలో భాగంగా బస్తీల, కాలనీలలో గత వారం రోజులుగా పాదయాత్ర నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై దృష్టిని కేంద్రీకరిస్తున్నారు టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాన సమస్యలపై అధిక శాతం ఫోకస్ చేస్తామని విజయారెడ్డి సూచిస్తున్నారు. ప్రస్తుతం తమ ఆధీనంలో వాటి పరిష్కారమార్గం కోసం కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొంటున్నారు. ఈమె పాదయాత్రలో మాజీ కార్పొరేటర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటున్నారు.

## విద్యార్థులు ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలి

**ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఎసిపి శంకర్ రాజు**



ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎసిపి

అల్వాల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఎసిపి శంకర్ రాజు తెలిపారు. సోమవారం అల్వాల్ కానాజీగూడ లోని ఎస్ఆర్ డిజి పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత ట్రాఫిక్ నియమ నిబంధనలకు సబంధించిన అంశాలులో ఎసిపి అవగాహన కల్పించడం జరిగింది. వాహనాలు డ్రైవింగ్ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ట్రాఫిక్‌లో అనుసరించాల్సి పద్దతులను వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ద్వారా పట్టుబడితే విధించే శిక్షలను తెలిపారు. నిబంధనలు బేఖాతరు చేయడం ద్వారా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల సంఖ్యను చెప్పారు. నిర్లక్ష్యంగా వాహనాలు నపడం నిబంధనలు పాటించక పోవడం వలన రోడ్లుపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు ట్రాఫిక్‌పై ఉన్న అనుమానాలను ప్రశ్నలు అడగడం ద్వారా నివృతి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మంజుల రెడ్డి ట్రాఫిక్ విభాగానికి చెందిన అబ్దుల్ మజీద్ ఖాన్ నర్సింహ ఇతరులు పాల్గొన్నారు.

## వేతన సవరణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

**తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ**



జేఏసీ సమావేశంలో సాయిబాబు, రత్నాకర్‌రావు, సదానందం తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: విద్యుత్ ఉద్యోగులకు రావల్సిన నూతన పిఆర్‌సిపై సంవత్సరకాలం పూర్తికావస్తున్నప్పటికీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో, విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఉద్యమబాటకు సిద్ధమయ్యాయి. ఈమేరకు హైదరాబాద్‌లోని 1104 కార్యాలయంలో జేఏసీ నేతలు సమావేశమై సుదీర్ఘ చర్చల అనంతరం ఉదనయమకార్యాచరణకు నాందిపలికారు. ఈనేపథ్యంలో ఫిబ్రవరి 21,22తేదీల్లో సర్కిల్ లెవల్ మీటింగ్స్, 24,25 ,28తేదీల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, మార్చి 1,2తేదీల్లో డివిజన్ ఆఫీస్, జనరేటింగ్ స్టేషన్‌లవద్ద భోజన విరామ సమయాల్లో ప్రదర్శన, మార్చి 3,4తేదీల్లో సర్కిల్, కార్పొరేట్ కార్యాలవద్ద ప్రదర్శన, 8నుంచి 23వరకు రీలే నిరాహారదీక్షలు, 14న కెటిపిఎస్ వద్ద నిరసనసభ, 17న వరంగల్ నిరసనసభ, 21న హైదరాబాద్‌లో నిరసన సభ నిర్వహించడంతో పాటు మార్చి 24న విద్యుత్ సౌధలో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. కావున టిఎస్‌పిఈజేఏసీ లోని యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు తమ వంతు బాధ్యతలో భాగంగా కార్యక్రమాలు జయప్రదం చేయాలన్నారు. ఈసమావేశంలో జేఏసీ చైర్మన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్‌రావు, కోచైర్మన్ శ్రీధర్, వజీర్, కరుణాకర్‌రెడ్డి, నాగరాణి, సదానందం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సాయన్న అంతిమయాత్రలో పాల్గొన్న కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే, మంత్రి శంకర్‌రావు తదితరులు

## ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం



ఉన్నతాధికారులతో సమావేశమైన మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

నిజాంపేట్, ఫిబ్రవరి20 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కార్పొరేటర్లు, ఉన్నతాధికారులతో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్‌యార్డు, ఎస్ఎన్‌డీపి నాలా నిర్మాణాలు, రోడ్డు వర్క్స్, డ్రైనేజీ, రోడ్డు విస్తరణ, బస్తీ దవాఖాన, వైకుంఠధామం, శానిటేషన్, ఓపెన్ జిమ్స్, క్రీడా ప్రాంగణం, పట్టణ అభివృద్ధి, పార్కు అభివృద్ధి పనులు తదితర అంశాలపై మేయర్ అధికారులతో సుధీర్ఘంగా చర్చించారు. అభివృద్ధి పనులన్ని నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు మేయర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జీ కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు విజయలక్ష్మీ, చిట్ల దివాకర్, కాసాని సుధాకర్ ముదిరాజ్, శ్రీరాములు, ఎన్ఎంసీ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 15వ రోజుకు చేరుకున్న హాథ్ సే హాథ్ జోడో



గడప గడపకు తిరుగుతూ ప్రచార చేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో టీపిసిసి అధికార ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి ప్రారంభించిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం సోమవారంతో 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కొలన్ హన్మంతరెడ్డి సూరారం డివిజన్ పరిధిలో రామకృష్ణ నగర్ చౌరస్తా, సోనియాగాంధీ నగర్, హమీద్‌బస్తీ, లక్ష్మీనగర్, సూరారం విలేజ్, విశ్వకర్మ కాలనీలలో గడప గపకు తిరిగి హాథ్ సే హాథ్ జోడో స్టిక్కర్లను అంటించి కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపి, బిఆర్ఎస్ పార్టీల ధ్వంధ్వ నీతిని, మోసపూరిత హామీలతో ప్రజలకు చేసిన అన్యాయాలను తెలియజేయడమే కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షు డు శ్రవణ్‌కుమార్, దళిత సేన అధ్యక్షుడు జేమ్స్, నాయకులు సంజీవరెడ్డి, పండరీరావు, సంతోష్‌ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, సంపంగి, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, నవీన్, అబ్బాస్, సలీం, సోహైల్, సురేందర్‌రెడ్డి, సురేష్, మల్లేష్, యాదమ్మ, బేగం, హసీనా, అన్నపూర్ణ, వరలక్ష్మీ, మణెమ్మ, సువర్ణ, మంజుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆస్ట్రేలియాలో చదవాలనుకునే విద్యార్థులకు అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యఅభ్యసించి స్థిరపడాలనుకునే విద్యార్థుల కోసం మంగళవారం అస్ట్రేలియా అడ్మిషన్స్‌డే నిర్వహిస్తున్నట్లు యునిఎక్స్‌పర్ట్ తెలంగాణ హెడ్ ఉమా తెలిపారు. ఈమేరకు సోమాజిగూడలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈఅడ్మిషన్‌డేలో ఆస్ట్రేలియాకు చెందిన 25కిపైగా యూనివర్సిటీలు పాల్గొంటాయని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు వీసా రిక్రూట్‌మెంట్ ,అడ్మిషన్, స్కాలర్‌షిప్, లాంగర్ స్టడీబ్యాక్ తదితర అంశాలను నేరుగా యూనివర్సిటీ ప్రతినిదులతో మాట్లాడి తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. అడ్మిషన్ గ్యారెంటీతోపాటు విద్యార్థులు 50శాతంపైగా స్కాలర్‌షిప్, ఆరు సంవత్సరాల వర్క్‌వీసా, టెస్ట్‌పిఆర్ ఆర్షన్‌ను పొందుతారని తెలిపారు. ఇంటర్ ,డిగ్రీ ,బిటెక్ విద్యార్థులు ఎవరైనా పాల్గొనవచ్చునని ఆమె పేర్కొన్నారు.

## అమావాస్య రోజు భవన నిర్మాణ కార్మికులు పనులను బంద్ చేయాలి



హెచ్ఎఫ్‌నగర్‌లో భవన నిర్మాణ కార్మికుల కార్యాలయం వద్ద గుర్తింపు కార్డులను అందజేస్తున్న అసోసియేష్ అధ్యక్షులు మహ్మద్ అహ్మద్

యూసుఫ్ గూడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : అమావాస్య రోజున విధిగా భవన నిర్మాణ కార్మికులు పనులను బంద్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మహ్మద్ అహ్మద్ అన్నారు. సోమవారం అమవాశ్య సందర్భంగా హెచ్ఎఫ్‌నగర్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దాదాపు 12వేల మంది వరకు కార్మికులు ఉన్నారని తమకు కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలను కోరారు. అదేవిధంగా సెంట్రింగ్ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రస్తుతం రూ.6.20లక్షలు ఇస్తున్నారని దానికి రూ.10లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రమాద భీమా అందజేస్తున్నారని ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు కూడా ప్రమాదవ భీమా అందేలా ప్రభుత్వం చర్యలుతీసు కోవాలని కోరారు. కార్మికులంతా తమ హక్కులను సాధించుకునేందుకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ యాదగిరి, సయ్యద్ ఫారుక్, కొలనుకృష్ణ, బండారి, చైతన్ శీను, సింగారి శ్రీనివాస్, రహీమ్, ముజీబ్ పాల్గొన్నారు.

## పెంచిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలి : బిజెపి




కోకాపేట్‌లో ఏర్పాటు చేసిన బిజెపి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి

నార్సింగి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : ఏకపక్షంగా పెంచిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నార్సింగి మున్సిపల్ బిజెపి అధ్యక్షులు చిక్కిరి బిక్షపతి యాదవ్ అధ్యక్షతన సోమ వారం నార్సింగి మున్సి పాలిటీ పరిధిలో బిజెపి కార్నర్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుదర్శన్ మాట్లాడుతూ ప్రజలపై ఎడాపెడా పన్నుల భారాన్ని మోపుతూ వారిని అవస్థల పాలు చేస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చారాన కోడీకి బారానా మసాల అన్న ట్లు తెలంగాణ సర్కారు గోరంత చేసి కొండంత ప్రచారం చేసుకోవడం సిగ్గుచేట న్నారు. ప్రజలకు మౌళిక వసతులు మెరుగు పర్చడంపై దృష్టి సారించాలని, దేశం, దర్మం కోసం పని చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. సర్కారు భూములను కాపాడి భావి పౌరుల కోసం భద్రపర్చకుండా కోకాపేట్‌లో ఉన్న వందలాది ఎకరాల భూమిని తెగనమ్ముకోవడం దారుణమన్నారు. బిజెపి నాయకులు ప్రజల ఇబ్బందులపైనే పోరాటాలు చేయాలని, నిత్యం ప్రజల మధ్యనే ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, డి.లక్ష్మీనా రాయణ, బుచ్చిరెడ్డి, నాగేష్, శ్రీనివాస్‌చారి, గోవిందిగారి శివరాజ్, మెండె నాగేష్, మల్లేష్ యాదవ్, భూత్ అధ్యక్షులు చెన్నయ్య, విక్కి, వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్, కౌన్సిలర్ ఆదిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ కాలనీలో నూతన రోడ్డు పనులు ప్రారంభం

నిజాంపేట్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ రేణుక ఎల్లమ్మ కాలనీకి మంజూరైన నిధులతో సోమవారం నూతన రోడ్డు పనులను కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్నానని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మేయర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్, ఫిబ్రవరి20 ప్రభాతవార్త: 33/11కేవీ మల్లంపేట్, నిజాంపేట్ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించుటకై మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. నిజాంపేట్ సబ్‌స్టేషన్ 11కేవీ రాజధాని, బండారి లేఅవుట్ ఫీడర్ల పరిధిలోని నిజాంపేట్ గ్రామ పంచాయతి రోడ్డు, రెడ్డి అవెన్యూ, ఆదిత్యలాగూన్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ ఉండదు. 11కేవీ బండారి లేఅవుట్ ఫీడర్ పరిధిలోని బండారి లేఅవుట్‌రోడ్డు నెంబర్ 1-4,5ఎ,6ఎ,7ఎ,8ఎ,9ఎ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్‌ఉండదు. అదే విధంగా 11కేవీ మల్లంపేట్ ఫీడర్ పరిధి లోని కేఆర్‌సీఆర్ కాలనీ రోడ్డు నెంబర్1,6 ప్రాంతంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, రెయిన్‌బో కాలనీ, బ్లాక్ డైమండ్ కాలనీ, ఇందిరానగర్, ఐడీపీఎల్ కాలనీ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ ఉండదు. కావున విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు.

## బిజెపి అధ్యక్షులు బండి సంజయ్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్



బేగంబజార్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్‌గా భారతీయ జనతా పార్టీ పక్షాన నియమితులైన బేగంబజార్ డివిజన్ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్ మర్యాద పూర్వకంగా తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను కలిశారు. ఈసందర్భంగా బండి సంజయ్‌ను కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్ శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## గోశాలల్లో ఆవులకు ఆహారం వేసిన నాయకులు



గోవులకు గడ్డివేస్తున్న భజరంగ్‌సేనా ఉపాధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మన్‌రావుగుప్త తదితరులు

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న గోశాలల్లో ఆవులకు భక్తులకు తమకు తొచ్చిన విధంగా ఆహారాన్ని అందచేశారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఇమ్లీబన్‌లోని గోశాలల్లో గోవులకు భజరంగ్‌సేనా ఉపాధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త గడ్డివేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ప్రతినిధులు ఎస్ రంజనీ, సూర్యశుక్లా, రాజేందర్, సవితా జైస్వాల్, అరుణ్‌కుమారి, అరున్‌సింగ్ అనిరుద్‌అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాటరీ దొంగలను పట్టుకున్న పోలీసులు

గన్‌ఫౌండ్రి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: నగరంలోని వేర్వురు పోలీస్ స్టేషన్ ప్రాంతాలల్లో ట్రాఫిక్ సిగ్నల్ బ్యాటరీలను దొంగతనం చేస్తున్న తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అబిడ్స్ పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాదరావు కథనం ప్రకారం.. షేక్‌అజీముద్దీన్ ఎలియాస్ అజీం, జె.మద్దిలేటిలు అబిడ్స్, బేగంబజార్, బేగంపేట్, కాచిగూడ, లంగర్‌హౌజ్, హాబీబ్‌నగర్, గోపాలపురం, మలక్‌పేట్, షాహినాయత్ గంజ్, సైఫాబాద్, చైతన్యపురి పోలీస్‌స్టేషన్ల పరుధుల్లో ట్రాఫిక్ సిగ్నల్‌బ్యాటరీలు26 పెద్దబ్యాటరీలు, 48మంది చిన్నబ్యాటరీలను దొంగలించారు. సుమారు 5లక్షల రూపాయల విలువ ఉంటుందన్నారు. ఈ కేసును అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బ్యాటరీ దొంగలను పట్టుకోవడంలో ప్రత్యేక చొరవ చూపిన ఎస్ఐలు ఎన్.నాగేంద్‌గౌడ్, కె.నిరంజన్, కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, రతన్, రవికుమార్‌యాదవ్‌లను ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాదరావు అభినందించారు.

## సిరాజ్ మృతి చాలా బాధాకరం : మంత్రి తలసాని



బీఆర్ఎస్ నాయకులు జాఫ్రీ మసీదు అధ్యక్షులు సయ్యద్ సిరాజుద్దీన్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : సిరాజ్ మృతి చాలా బాధాకరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. సనత్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు జాఫ్రీ మసీదు అధ్యక్షులు సయ్యద్ సిరాజుద్దీన్ గత కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించారు. సోమవారం మంత్రి శ్రీనివాస్ యాదవ్ సనత్‌నగర్‌లోని జాఫ్రీ మసీదులో సిరాజ్ పార్థివదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, రాజేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు 15 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి : విద్యార్థినేతలు

తార్నాక, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: రాష్ట్ర సాధన కోసం జీవితాలను ఫణంగా పెట్టి పోరాడిన 2009 విద్యార్థి ఉద్యమ కారులకు అన్ని రాజకీయ పార్టీలు 15శాతం టికెట్లను కేటాయించాలని విద్యార్థి ఉద్యమ కారులు సమావేశంలో తీర్మానించారు. సోమవారం ఓ.యూ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విధ్యార్థి నేతలు పెద్ద ఎత్తున పాల్గొని డిమాండ్లు, హక్కులపై గళమెత్తారు. 2009 విద్యార్థి ఉద్యమ నేతలు విద్యా సంవత్సరాలను కోల్పోయి, ఉద్యోగాలు లేక రాజకీయాల్లో భంగపడి, కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ కారులన గ్రీవెన్స్ సెల్, సహాయ నిధిని ఏర్పాటు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, ప్రసంశాపత్రాలను, ఆరోగ్య కార్డులను ఇచ్చి గౌరవించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన అమర వీరుల కుటుంబాలతో పాటు బ్రతికి ఉన్న ఉద్యమకారుల వెతలను అన్ని రాజకీయ పార్టీలు పట్టించుకొని తగిన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. విద్యార్థి ఉద్యమ కారుల స్వీయ చరిత్రను బుక్‌రూపంలో తెచ్చి ఉద్యమ ఆకాంక్షలను ప్రజలకు తెలియజేసేలా కార్యచరణ తీసుకురావాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో డా. వట్టికూటి రామారావుగౌడ్, రాసవెంకట్ ముదిరాజ్, పుప్పాల మల్లేష్, నెహ్రూనాయక్, దత్తాత్రేయ, సాంబశివగౌడ్, కోట శ్రీనివాస్ గౌడ్, కైలాష్ నేత, కేతూరి వెంకటేష్, దుర్గం భాస్కర్, విజయ్‌కుమార్, నిర్జన రమేష్, సత్య, సంజీవ్, సంపత్ నాయక్, దయాకర్, సమ్మయ్య, అశోక్ యాదవ్, సలీం పాష, వరంగల్ రవి, కొత్తపల్లి తిరుపతి, బెల్లెట్ కృష్ణ, శ్రీకాంత్ నేత, రవీంద్రనేత, పోశెట్టి, గాదెవెంకట్, శంకర్, ఆశప్ప, పల్లెర్ల సుధాకర్, డా. వీరు యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: అంగన్‌వాడీ కేంద్రాలు విధులు నిర్వహిస్తున్న కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలనివారు కోరారు. ఈమేరకు ఘట్‌కేసర్ మండల కార్యాలయంలో సోమవారం ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డిని కలిసిన అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలో టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపిపి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల సవరణలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం బిఎల్ఓలుగా బాధ్యతలు అప్పగించిందని విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ఆరోగ్యలక్ష్మి ద్వారా గర్భిణీలకు, బాలింతలకు ఇచ్చే భోజనం టిహెచ్ఆర్ రూపంలో సరుకులు ఇంటికి ఇచ్చేవిధంగా చూడాలని పేర్కొన్నారు. సరుకులు, కూరగాయల ధరలు పెంచడం, బిల్లులు ప్రతినెలా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉజ్జయిని మహంకాళినగర్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించండి



మంచినీటి సమస్యలను ఎమ్మెల్యే గాంధీకి తెలుపుతున్న స్థానికులు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : ఉజ్జయిని మహంకాళి నగర్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ సోమవారం ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళి నగర్‌లో మంజీరా వాటర్ సమస్యగా ఉందని నీళ్ళు వస్తున్నా సరైన ప్రెజర్ తక్కువగా ఉండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని కాలనీ ఎత్తులో ఉండడం వల్ల ప్రెజర్ తక్కువగా వచ్చే అవకాశం ఉందని అన్నారు. దానికి అనుగుణంగా ప్రత్యామ్యాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాశినాథ్‌యాదవ్, చాగంటి అశోక్, సైదులు, కృష్ణ, చంద్రశేఖర్, కోటిరెడ్డి, వెంకటేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నీటి సమస్యలను పరిష్కరించండి : ప్రభుత్వవిప్ గాంధీ**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పలు కాలనీలలో ప్రజల నుండి వచ్చిన మంచినీటి సరఫరాలో తలెత్తిన సమస్యలను తక్కువనీటి పరిణామంతో, నీటి విడుదల సమయం పెంచుటలో ప్రెజర్ వంటి సమస్యలను పరిష్కరించాలని జలమండలి అధికారులకు ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ తెలియజేశారు. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టు కుని మంచినీటి సరఫరా వ్యవస్థలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలను చేపట్టాలని కోరారు. ప్రజలకు మెరుగైన మంచినీటి సరఫరాను చేపట్టాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని, పెరుగుతున్న కాలనీలను, జనవాసాలను దృష్టిలో పెట్టుకుని వారికి తగిన విధంగా నీటి సరఫరా చేపట్టాలని కోరారు. అదేవిధంగా తక్కువ నీటి సరఫరాతో ఇబ్బందులుపడుతున్న కాలనీలను గుర్తించి వారికి మెరుగైన అధిక పరిణామంలో నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. గోకుల్ ఫ్లాట్స్, కొండాపూర్, మాధాపూర్, లింగంపల్లి, కావూరిహిల్స్, అయ్యప్ప సొసైటీ, గచ్చిబౌలీలో నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకొని నీటి సరఫరా చేపట్టాలన్నారు.

## అమరవీరుల త్యాగాల రూపమే ఆజాదీకీ అమృత్ మహోత్సవ్: వివేక్ వెంకటస్వామి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : ఛత్రపతి శివాజీ చూపిన బాటలో భారతసైనికులు తమ అసమాన ధైర్య సాహసాలను ప్రదర్శించి దేశానికి గర్వకారణంగా నిలవటం ద్వారా యావత్ భారతదేశం తలెత్తుకునేలా చేసిన కార్గిల్ యుద్ధ సైనికుల ధైర్యసాహసాలు మరిచిపోలేనివని మాజీఎంపి, భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్‌వెంకటస్వామి కొనియాడారు. భాగ్యనగర్ శివాజీ సేవాసమితి అధ్యక్షులు నందనం దివాకర్ నాయకత్వంలో కార్గిల్‌యుద్ధంలో వీరోచితంగా పోరాడిన 75 మంది కార్గిల్ యుద్ధవీర సైనికులకు దేశ 75వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఛత్రపతి శివాజీ పురస్కారాలను బహుకరించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్‌లో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ లోక్‌సభ సభ్యులు బూర నర్సయ్యగౌడ్, బిజెపి ఒబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షులు ఆలె బాస్కర్‌రాజ్, మెదక్‌జిల్లా ఇంచార్జి మల్లారెడ్డి నారాయణ పెట్, మేడ్చెల్ జిల్లా ఇంచార్జి కాంతారావు నాయకులు వడ్డెపల్లి రాజేశ్వరరావు, జూబ్లిహిల్స్ ఇంచార్జి బక్కాశంకర్‌రెడ్డి, జహీరాబాద్ ఇంచార్జి సి.ఆర్.నటరాజ్ గౌడ్‌లతో కలిసి సైనికులకు ఛత్రపతిశివాజీ పురస్కరాలను అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఆజీదీకా అమృత్‌మహోత్సవ్ దేశరక్షణకు తమ ధన, మాన, ప్రాణాలను అర్పించేందుకు సిద్దపడ్డ సైనికుల మధ్య జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఆయా సైనిక కుటుంబాల త్యాగాలను చివరివరకు స్మరిస్తూ వారికి పాదాభివందనం చేయడం అభినందనీయమన్నారు. భాగ్యనగర్ శివాజీ సేవాసతిమి అధ్యక్షులు నందనం దివాకర్ మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా ఛత్రపతి శివాజీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సైనికులను గౌరవించుకోవడం ఈ సంవత్సర ప్రత్యేకతగా కొనియాడారు. అనంతరం పేద మహిళలకు చీరలపంపిణీ నిర్వహించి సామూహిక భోజనాలను సైనికులతో కలిసి నిర్వహించారు.



సాయికుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా సాయికుమార్

**కోహెడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చెంచల్ చెరువుపల్లి గ్రామంలో యువజన కాంగ్రెస్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తిమ్మాపురం సంపత్‌రావు, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి తిరుపతిరెడ్డి సమక్షంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూలం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికలో యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా పిడిశెట్టి సాయికుమార్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎల్లబోయిన చందుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా తిప్పారపు మనోహర్, కోశాధికారిగా పోతు శేఖర్, ప్రచార కార్యదర్శిగా ఉడితం నవీన్, సోషల్ మీడియా ఇరుమళ్ల రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భగంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దూలం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే రోజుల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. భవిష్యత్‌లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, తిరుపతి, శ్రీకాంత్, రంజిత్, చందు, మనోహర్, చంద్రరావు, నవీన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బండి ప్రయత్నం

**బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి**



మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ నాయకులు

**బెజ్జంకి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారని బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మండలంలో ఓ కార్యక్రమానికి విచ్చేసిన బండి సంజయ్ మండలాన్ని తిరిగి కరీంనగర్‌లో కలుపుతామని చేసిన వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి మేరకు రాష్ట్రపతి అమోదం పొందిన తర్వాతే జిల్లా, మండలాల విభజనలు చేపట్టడం జరిగిందన్నారు. కనీసం పరిజ్ఞానం లేకుండా మండలాన్ని కరీంనగర్‌లో కలుపుతామని మాట్లాడడం సరికాదన్నారు. మండల అభివృద్ధికి మంత్రి హరీష్‌రావు రూ. 20 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. కరీంనగర్ ఎంపిగా బండి సంజయ్ గెలిచి నాలుగేళ్లు కావస్తున్నా మండలానికి ఎన్ని నిధులు మంజూరు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవపట్టించే రీతిలో మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ కచ్చు రాజయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సంజీవరెడ్డి, నాయకులు లక్ష్మణ్, తిరుపతి,మోహన్, శ్రీనివాస్, బాలనర్సు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి సేవారత్న అవార్డుగ్రహీతకు సన్మానం



రాగుల రాజును శాలువాతో సన్మానిస్తున్న ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాగుల రాజుకు ఇటీవల బిసి సేవారత్న అవార్డు రావడంతో ఆయనను ఆదివారం రాత్రి ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. జగదేవ్‌పూర్‌లో ఆదివారం జరిగిన శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపి కార్యక్రమం అనంతరం రాగుల రాజును సన్మానించి అభినందించారు. మండలంలోని ముదిరాజ్ సంఘం కులస్తుల సమిష్టికి కృషిచేసిన రాగుల రాజుకు తెలంగాణ రాష్ట్ర బిసి సేవారత్న అవార్డు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, కొండపాక మండల పిఎసిఎస్ వైస్ చైర్మన్ అమర్, జగదేవ్‌పూర్ మండల ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు హేమ సురేష్, మండల కోశాధికారి కొంపల్లి శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తా

**-ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి**



కొండపోచమ్మ ఆలయం వద్ద డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న రంగారెడ్డి

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కొండ పోచమ్మ దేవస్థానం వద్ద నెలకొన్న పలు సమస్యలను మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ములుగు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొండపోచమ్మ ఆలయం వద్ద నెలకొన్న సమస్యలను సర్పంచ్ గర్నెపల్లి రజిత రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఆలయం వద్ద డ్రైనేజీ వ్యవస్థను సరిచేయడానికి నూతన నిర్మాణాలు చేపట్టాలని, అలాగే మిగిలిఉన్న రోడ్డు పనులను పూర్తి చేసేందుకు, భక్తుల సౌకర్యార్థం శౌచాలయాలను ఏర్పాటు విషయంపై మంత్రి దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ కుమ్మరి కనకయ్య, విఆర్‌ఏ శ్రీను తదితరులు ఉన్నారు.

## కోనాపూర్‌లో స్వయంపాలన దినోత్సవం

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రామాయంపేట మండలం కోనాపూర్ చిన్నతాండ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారని ప్రధానోపాధ్యాయులు సరాఫ్ ఇంద్రసేనాచారి, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యా యు లుగా కరీం, ఇర్ఫాన్, రాజేష్, కళ్యాణ్‌రామ్, భార్గవి, వసంత, కాస్మా, సల్మా, నీలా, రషాదా, సబియా, సమీరాలు డీఈవో, ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎం, సీఆర్‌పి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులుగా వ్యవహరించారని తెలిపారు.



పాఠశాలలో సయంపాలన నిర్వహిస్తున్న దృశ్యం

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తా

**ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి**



పిఆర్‌టియు ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** ఉపాధ్యాయుల జీవన ప్రమాణాల పెంపుకు 50 సంవత్సరాలుగా ఎన్నో జిఓలను సాధించిన ఏకైక సంఘం పిఆర్‌టియు అని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో మండల శాఖ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, కార్యదర్శి శేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ 30శాతం ఉపాధ్యాయులకు పిఆర్‌సి ఇప్పించిన ఘనత పిఆర్‌టియు సంఘానిదేనని, కోర్టు కేసు ద్వారా ఆగిపోయిన బదిలీలు, పదోన్నతులు స్టే వెకొట్ చేయించి ఏప్రిల్ 23లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తిచేయిస్తామని, అదేవిధంగా పండిట్, పిఈటి అప్‌గ్రేడేషన్, పిఎస్‌హెచ్‌ఎం సమస్యలను పరిష్కరించి ఇదే షెడ్యూల్‌లో పదోన్నతులు కల్పించేలా చూస్తామని, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు త్వరలోనే పాత పెన్షన్ విధానాన్ని అమలుపర్చేలా చూస్తామని, ఏప్రిల్ 1 నుండి కొత్త ఆరోగ్య పథకంతో ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు అమలు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పత్రిక సంపాదకవర్గ సభ్యులు జైపాల్‌రెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గణేష్, జ్యోతిరెడ్డి, పిజి ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, మాధవరెడ్డి, ఎండి.రహీం, శ్రీనివాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ స్లీవన్ రాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజునాయక్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు

**నిజాంపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖ అధికారులు హాజరై ఆయా శాఖల పనితీరు గురించి సమస్యల గురించి వివరాంచారు. ఈసందర్బంగా మండల వ్యవసాయ అధికారి సతీష్ మాట్లాడుతూ రైతుబంధుకు అర్హులైన 9605 రైతులు ఉండగా 9557 మందికి రైతు బందు నగుదు జమయ్యాయని, రైతులకు ఎలాంటి ఎరువులు ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉన్నాయన్నారు. అదేవిధంగా పాస్‌బుక్‌లో ఎలాంటి పొరపాట్లు జరిగితే ధరణి పోర్టల్ ద్వారా సరి చేసుకోవచ్చని ఇంచార్జి తహసిల్దార్ గంగా ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో రాజేందర్, ధర్మారం డాక్టర్ హరిప్రియ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అమరసేనారెడ్డి, నిజాంపేట సర్పంచ్ అనూష, ఎంపిటిసి లహరికృష్ణారెడ్డి, సొసైటీ చైర్మెన్ బాపురెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు నరసింహారెడ్డి, చంద్ర వర్దిని, బాల్ నర్సవ్వ, ఎంపిటిసీలు బాల్‌రెడ్డి, భాగ్యలక్ష్మి వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రొటోకాల్ పాటించలేదని సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపిటిసి**

నార్లపూర్ గ్రామంలో మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా నీటిని విడుదల చేసిన కార్యక్రమంలో అధికారులుగానీ పార్టీ సభ్యులు గాని తనకు సమాచారం ఇవ్వలేదని నార్లాపూర్ ఎంపీటీసీ రాజిరెడ్డి ఎంపీపీ దేశెట్టి సిద్దరాములును అధికారులను నిలదీశారు. అందుకు నిరసనగా సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు.

## నగరంలో కంటి వెలుగు విజయవంతం

**దుబ్బాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని నగరం గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని బిఆర్‌ఎస్ నాయకులు జీడిపల్లి శ్రీనివాస్, ఎల్కపల్లి స్వామి, సంద సిద్దిరాములు, భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగు ద్వారా అనేకమంది కంటి పరీక్షలు చేయించుకోవడం జరిగిందన్నారు. గ్రామంలో నేటితో కంటి వెలుగు పూర్తయిందని, కంటి వెలుగు విజయంతగా ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, అంగన్‌వాడి సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడి టీచర్ మంజుల, వైద్యాధికారులు సాయి తేజశ్విని, వైద్యబృందం నవీన్, కిరణ్, రమేష్, నికిత, స్వరూపా, శ్రావంతి, ఎఎన్‌ఎం ప్రమీల,సునిత, అశా కార్యకర్తలు స్వప్న, పుష్పలత, లావణ్య, కవిత పాల్గొన్నారు.

## విద్యా రంగానికి పెద్ద పీట : ఎమ్మెల్సీ



ప్రాథమిక పాఠశాలను సందర్శిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కాసులబాద్ ప్రాథమిక పాఠశాలలను మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ఈ సందర్బంగా ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులతో పాటు మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరా వ్వత ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనంతో పాటు కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా మౌలిక వసతుల కల్పన కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో సర పంచ్ తుమ్మల బాలరాజు, హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, పిఆర్‌టియు నాయకులు నాగిరెడ్డి, వెంకట్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పంచాయతీ పాలక వర్గం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఖదీర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి20 ప్రభాతవార్త:** పోలీసుల చిత్రహింసలకు గురై మృతి చెందిన ఖదీర్ కుటుంబానికి చిన్నశంకరంపేట ఎంపీపీ, కాంగ్రెస్ నేత ఆవుల భాగ్యలక్ష్మీగోపాల్‌రెడ్డి రూ.11 వేల ఆర్థిక సాయం అందించారు. కాంగ్రెస్ నేతలతో కలిసి ఆమె సోమవారం ఖదీర్ భార్య సిద్ధేశ్వరిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత ఆవుల గోపాల్‌రెడ్డి, హవేళిఘనపూర్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అక్బర్, కాంగ్రెస్ నేతలు షేక్ సల్మాన్, వార్డు మెంబర్ వడ్ల రాజు, గల్‌రెడ్డి, వడ్ల కుమార్, ఘనపూర్ మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీశైలం, పుర్కాన్, ఆమెర్, నసీర్ తదితరులు ఉన్నారు.

## బాధితురాలికి వాకర్ అందజేత

**వెల్దుర్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన తాటి యాదమ్మ అనారోగ్యానికిగురై నడవలేని స్థితిలో ఉండటంతో స్పందించిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణాగడ్ ఆమెకు వాకర్‌ను అందజేశారు. బాధితులు భార్త ఎల్లయ్య వాకర్ అందజేసినందుకు కృష్ణాగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రమాదం నుంచి బాలికను కాపాడిన ఖాకీ

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాత జాతర ఉత్సవాల్లో పాల్గొన్న బాలికను ప్రమాదానికి గురికాకుండా పోలీసు కానిస్టేబుల్ వెంకటేశం కాపాడిన సంఘటన ఆదివారం రాత్రికి చోటు చేసుకుంది. ఆదివారం రాత్రికి జాతర ఉత్సవాల్లో ఎడ్ల బండ్ ఊరేగింపు జరుగుతోంది. ఊరేగింపును తిలకిస్తున్న పాపన్నపేటకు చెందిన బాలిక చాకలి పోచమ్మ అటుగా వస్తున్న కాడెడ్ల బండి కింద పడిపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వెంకటేశం బాలికను ప్రమాదం నుంచి చాకచక్యంగా రక్షించారు. స్వల్ప గాయాలకు గురైన బాలికను కానిస్టేబుల్ వెంకటేశం వీల్ చైర్‌పై బాలికలను తరలించి ప్రథమ చికిత్సలు అందుకునేలా సహకరించారు.

## మంజీరాలో మునిగి కాపరి మృతి

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మంజీరాలో మునిగి పశువుల కాపరి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొంపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగింది. కాపరుల కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన గొర్ల నర్సింహులు (48) మూగజీవాలను మేపుతూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ నెల 18న తన మూగజీవాలను తీసుకుని కొంపల్లి గ్రామ శివారుకు వచ్చి ఆదివారం సాయంత్రం మూగజీవాలను నది దాటించి తనతో పాటు ఉన్న కపాల కుక్కతో నర్సింహులు నది దాటుతుండగా ప్రమాదావశాస్తు నీట మునిగి పోయాడు. నర్సింహులు ప్రమాదానికి గురైనట్లు తెలుసుకున్న తోటి కాపరులు విషయాన్ని కుటుంబ సభ్యులక సమాచారం అందించారు. సోమవారం నదితో నర్సింహులు మృతదేహం నీటిపై తేలియాడుతుండగా విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. మృతుడికి భార్య లక్ష్మీతో పాటు ఒక కూతరు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## కల్వర్టు గుంతలో పడి యువకులకు గాయాలు

**ఎలాంటి ఇండికేషన్స్ లేకుండా ఏజీ కన్‌స్ట్రక్షన్ రోడ్డు పనులు**

**నంగునూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఏజీ కన్‌స్ట్రక్షన్ నిర్లక్ష్యంతో బైక్‌లపై వస్తున్న వారు కల్వర్టు గుంతలో పడడంతో తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని పాలమాకుల గ్రామ శివారులో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. రాజగోపాల్‌పేట పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాలమాకుల గ్రామ శివారులో ఏజీ కన్‌స్ట్రక్షన్ వారు కల్వర్టు గుంతలను తవ్వి అక్కడ ఎలాంటి ఇండికేషన్స్ పెట్టకపోవడంతో బైక్‌లపై వెళ్తున్న ఇరువురు బోయిని నరేష్ సిద్దిపేట వైపు వెళ్తున్న క్రమంలో గుంతలో పడి గాయాలయ్యాయి. అలాగే మిట్టపల్లికి చెందిన పొన్నాల మల్లేశం బైక్‌పైవెళ్తు అదే గుంతలోపడి ఉన్నాడు. వీరికి తీవ్రగాయాలయ్యాయి. బోయిని నగేష్ తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు ఏజీ కన్‌స్ట్రక్షన్ సుమన్ బర్వా మీద కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ యాదవరెడ్డి తెలిపారు.



గుంతలో పడి ఉన్న మోటార్ సైకిల్ వాహనాలు

# కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యం

**కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి**



వీరానగర్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

**రాయపోల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే గ్రామాల్లో అభివృద్ధిపనులు జరుగుతాయని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా రాయపోల్ మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి, వీరానగర్, ఎల్కల్ గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకకాలంలో రైతుల రుణమాఫీచేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, మళ్లి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాగానే మొదటగా రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని అన్నారు. ఈ రోజు గ్రామాల్లో ఎక్కడ చూసిన ప్రతి గ్రామంలో బెల్టు షాపులు కనిపిస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం యువతను మద్యానికి బానిసలను చేస్తుందని ఆరోపించారు. దుబ్బాక నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లి చూసిన మాజీ మంత్రి ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి పనులే కనిసిస్తున్నాయన్నారు. గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతుంటే ప్రజలు అనేక సమస్యలు ఉన్నాయని చెబుతున్నారని, ముఖ్యంగా అర్హులైనవారికి పింఛన్లు రావడం లేదని, డబుల్ బెడ్ రూం ఇండ్లు అర్హులకు కాకుండ డబ్బులు ఇచ్చినవారికే అమ్ముకున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో ప్రజలు విసుగు చెందాతున్నారని చెప్పారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, దుబ్బాక నియోజక అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కర్నాల శ్రీనివాస్, గొల్లపల్లి కనకయ్య, సుధాకర్ పాల్గొన్నారు



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కృష్ణమూర్తి

## అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని జగదేవ్‌పూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.కృష్ణమూర్తి అన్నారు. జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై, రోడ్డు భద్రత, షీటీమ్స్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండి లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని, రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడిపేలా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరగాళ్ళ మోసాలకు గురికాకుండా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వ్యక్తిగత వివరాలను అపరిచిత వ్యక్తులకు వెల్లడించవద్దని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది సత్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎఫ్‌డిసి చైర్మన్

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** మండలపరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన కర్క కిష్టారెడ్డి అకాల మరణం చెందడంతో విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సోమవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. వీరివెంట గజ్వేల్ ఏఎంసి వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి, మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పనగట్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మద్దికుంట ఉప్పల్‌రెడ్డి, గోదల భాస్కర్‌రెడ్డి, యాదగిరి, కిష్టారెడ్డి, సత్తయ్య తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డిని గెలిపించాలి

**మాజీ ఎమ్మెల్సీ రవీందర్ ప్రచారం**



చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని ప్రచారంచేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రవీందర్

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని పిఆర్‌టియు యూనియన్‌కు చెందిన మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మండల అధ్యక్షుడు ఊడెం కృష్ణారెడ్డి, తీగుళ్ల లింగంగౌడ్‌లు పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పిఆర్‌టియు ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఆర్‌టియు సాధించిన విజయాల గురించి తెలియజేస్తూ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా హోదా, అప్రెంటిస్ పిరియడ్ రద్దు, రెండు నోషనల్ ఇంక్రిమెంట్స్ చైల్డ్‌కేర్ లీవ్‌లు, ఐదు స్పెషల్ సెలవులు, పిఆర్‌సి సాధన మొదలైన ఎన్నో జిఓలను సాధించిన ఘనత పిఆర్‌టియుదే అన్నారు. రాబోయే కాలంలో హెల్త్‌కార్డు, సిపిఎస్ రద్దుచేయడంతోపాటు నెల రోజుల్లో జరిగే ప్రమోషన్స్, బదిలీలలో పండిత్ పిఈటీల అగ్రిడేషన్‌తో పాటు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు ఇప్పించడం, పెండింగ్‌లో ఉన్న బిల్లులు జమ చేయించడం జరుగుతుందని, మార్చిలో జరగబోయే శాసనమండలి ఎన్నికల్లో పిఆర్‌టియు అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కె.హనుమంతరెడ్డి,శివశంకర్, ఏ.కనకరాములు, యు.శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, పోచయ్యగౌడ్, శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, భాస్కర్, నాగరాజు, వెంకటేశంగౌడ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

**కురుమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు పుష్ప నగేష్**



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కురుమ సంఘం నాయకులు

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** ఈనెల 26న సంగారెడ్డిలో జరిగే దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కురుమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు పుష్ప నగేష్ పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్‌లోని కురుమ సంఘం భవనంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ విగ్రహాన్ని సంగారెడ్డిలో ఆవిష్కరించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మంత్రి తన్నీరు హరీష్‌రావు హాజరుకానున్న ఈ కార్యక్రమానికి 10వేలకు పైగా కురుమ సంఘం సభ్యులతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు పుల్ల బీరయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు పులి బాల్‌చంద్రం, కురుమ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి, జిల్లా డైరెక్టర్ ఎల్లయ్య, సిహెచ్.లింగం, గంగాధర్, గజ్వేల్, ములుగు, వర్గల్ మండలాల అధ్యక్షులు నాగయ్య, బాలయ్య, సిహెచ్. కొమురయ్య, నాయకులు సిద్దాల రవి, అయిలయ్య, మహంకాళి నరేష్, పట్టణ యూత్ ప్రెసిడెంట్ కన్నా, రాజయ్య, యాదగిరి, అనిల్, నర్సింలు, అయ్యాలం, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉమామహేశ్వరస్వామి కళ్యాణం

**మర్కుక్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో ఉమామహేశ్వరుల కళ్యాణం వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణాన్ని తిలకించడానికి పెద్దఎత్తున భక్తులతో పాటు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు హాజరై స్థానిక ప్రజాప్రతినిధులతో స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతియేటా శివరాత్రి పర్వదినాన్ని పుస్కరించుకొని నాలుగురోజులపాటు ఉమామహేశ్వరుల కళ్యాణ మహోత్సవం కనులపండువగా జరుగుతుందని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఆలయ చైర్మన్ బల్లి శ్రీనివాస్‌గుప్త, సర్పంచ్ లక్ష్మిరాములుగౌడ్, ఎంపిటిసి నరేందర్, పాలకమండలి సభ్యులతో కలిసి అతిథులకు స్వామివారి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, యాదవరెడ్డి, స్టార్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అతిథులకు మెమొంటోలు అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

# రెండు నెలల్లో గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి

## నీటిపారుదల శాఖ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

హుస్నాబాద్,ఫిబ్రవరి20,ప్రభాతవార్త

వచ్చే రెండు నెలల్లోనే గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి మెట్టప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలోని లక్ష ఆరువేల ఎకరాలకు సాగునీరు అందిచబోతున్నామని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఇరిగేషన్ అధికారులు,నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హన్మకొండ జిల్లా పరిషత్ చైర్మెన్ మారంపల్లి సుదీర్‌కుమార్‌తో హాజరయ్యారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఉన్న సమస్యలను అధికారులు,నాయకులను అడిగి తెలుసుకుని మాట్లాడారు.నియోజకవర్గంలో 161 గ్రామాలలో మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వార 550 చెరువులను బాగుచేసుకున్నామని గుర్తు చేశారు. హుస్నాబాద్ మండలంలోని మహాసముద్రం గండిద్వార దాదాపు 16 గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు.నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.ఇప్పటికే నియోజకవర్గంలో దాదాపు లక్ష 14వేల ఎకరాలకు ఆయకట్ట సాగులోకి వచ్చిందన్నారు.వచ్చే ఎండాకాలంలో పంటలు ఎండకుండా అధికారులు చూసుకోవాలని ఆదేశించారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు పనులను ముత్యంనాయుడు కాంట్రాక్టర్‌కు అప్పగించామని ,ఎలాంటి ఆర్డర్ కాపీలు లేకుండానే ముత్యం నాయుడు దాదాపు 20లక్షల రూపాయల పనులు ఇదివరకే పూర్తి చేశారన్నారు.ముత్యంనాయుడు మాట్లాడుతూ తనకు అప్పగించిన పనులను ఒక్క నెలలోనే పూర్తి చేసి ఎల్లమ్మ చెరువు రూపురేఖలు మారుస్తామన్నారు.ఎల్లమ్మ చెరువు పనులు పూర్తికాగానే ఇటీవల మినీట్యాంగ్ బండ్‌గా మార్చేందుకు మంజూరైన మూడు కోట్లతో పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.మిగిలి ఉన్న ప్రాజెక్టు పనుల్లో అవసరం ఉన్నచోట లిఫ్టుల నిర్మాణం,కాలువల మరమ్మత్తులకు కావాల్సిన నిధుల గురించి ప్రతిపాదనలు పంపామన్నారు.2014 కంటే ముందు ఎప్పుడు లేని విధంగా గడిచిన 8 సంవత్సరాలలో కాకతీయ నార్త్ కెనాల్ ప్రారంబించి 6వేల ఎకరాలకు,మిడ్‌మానేర్ కెనాల్ నుండి 20వేల ఎకరాలకు,సింగరాయ ప్రాజుక్టు నుండి 10వేల ఎకరాలకు,శనిగరం ప్రాజెక్టు నుండి 22వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని,ఇక మహాసముద్రం గండి నుండి పనులు చేయడం వల్ల దాదాపు 16 గ్రామాల భూగర్బ జలాలు పెరిగాయన్నారు.గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిఅయితే ఇక బావుల్లో మగ్గులతో నీరుముంచుకునే రోజులు వస్తాయన్నారు.ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

నియోజకవర్గంలో 600ల రేట్లు వ్యవసాయ ం పెరగడం సంతోషకరమైన విషయమన్నారు. అంతేకాకుండా హుస్నాబాద్ పట్టణ కేంద్రానికి రెండు జాతీయ అవార్డులు రావడం గొప్పవిషయమన్నారు.హుస్నాబాద్ అంచలంచలుగా అభివృద్ది చెందుతూ అన్ని రంగాల్లో రానిస్తుందన్నారు.ఇప్పటికే పట్టణంలో అన్ని రకాలు బ్యాంకులు ఉన్నాయని,మండలంలో 17 సబ్‌స్టేషన్లతో పాటు 1400ల ట్రాన్సుఫార్మర్లు అందుబాటులో ఉంచుకున్నామన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్,మంత్రి కేటీఆర్, హరీష్‌రావు,గంగుల కమలాకర్,సత్యవతిరాథోడ్,ఎర్రవెల్లి దయాకర్‌ల సహకారంతో అభివృద్ది చేసుకోగలుగుతున్నామన్నారు.హుస్నాబాద్ నియోజకవర్గం పరుగులు తీస్తుందన్నారు.హుస్నాబాద్ నాలుగు జిల్లాల మధ్యలో ఉందని ఇఇ వరకే ఎల్కతుర్తి నుండి రామాయంపేట వరకు నేషనల్ హైవే పనులు ప్రారంభమయ్యాయని, కొత్తపల్లి నుండి జనగామ వరకు కూడా నాలుగు లైన్ల రోడ్డు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.ఇక రెండు నెలల్లో పూర్తి కావస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టును ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.ఇటీవల నిర్వహించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల డ్రాలో ఇండ్లు పొందిన వారికి అతి త్వరలోనే రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పట్టాలు అందించి పలు అభివృద్ది కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తామన్నారు. సిద్దిపేట జిల్లా వైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ సుమతిదేవి,ఈఈలు రాములు నాయక్,రమేష్, నారాయణ,హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న,ఎంపిపి లకావత్ మానససుభాష్,మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి,కోహెడ ఎంపిపి కొక్కుల కీర్తి సురేష్,అక్కన్నపేట ఎంపిపి మాలోతు లక్ష్మీబీలునాయక్,జడ్పిటిసి భూక్య మంగశ్రీనివాస్,నాగరాజుశ్యామలతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు,ఎంపిటిసిలు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న మధుమోహన్

## ఒత్తిడిని తగ్గించుకుందాం.. విజయాలు అందుకుందాం

### మనోవైద్య నిపుణులు మదుమోహన్

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తాము చేసే పనిలో విజయం సాధించేందుకు ఒత్తిడికి గురికాకుండా ఉండాల్సిన అవసరం ప్రతి వ్యక్తిపై ఉంటుందని మనోవైద్య నిపుణులు డాక్టర్ మధుమోహన్ సూచించారు. సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వతరగతి విద్యార్థులకు పరీక్షలను రాసేందుకు పాటించాల్సి పద్దతులు, ఒత్తిడిని తగ్గించుకునే తీరుపై అవగాహన కల్పించారు. ఒత్తిడితో పనులు చేస్తే ప్రయోజనం పొందలేమని, ఒత్తిడికి దూరంగా ఉంటూ పనులు చేసుకుంటే ఫలితాలు సాధించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సంగీత, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఫలితాలు వాటంతట అవే వస్తాయన్నారు. క్రమ శిక్షణతో పనులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడితో కాకుండా నేర్పరిగా విద్యను అభ్యసిస్తూ పరీక్షలు రాయాలని, మంచి శ్రేణిలో ఉత్తీర్ణులు కావడం ఖాయమన్నారు.

## ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

### దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :

ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి ఉన్నత శిఖారాలకు ఎదిగే విధంగా తయారు కావాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండల పరిధిలోని పెద్దచెప్యాల చౌరస్తాలోని గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించినక కార్యక్రమంలో పాల్గొని అయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. పట్టుదలతో చదివి గొప్ప స్థానానికి ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. పోటీలలో గెలుపు ఓటములు సహజమన్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులు గురుకుల పాఠశాలలో చదివి ఎవరెస్టు ఎక్కిన విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రతి విద్యార్థి రాణించాలన్నారు. చదువుకు పేదరికం అడ్డురా దన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖారాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గజ్జల సాయిలు, డిసిసిబి డైరెక్టర్ బక్కి వెంటకయ్య, అత్మకమిటీ చైర్మన్ భాస్కరాచారి, సర్పంచ్‌లు బాలనర్సింలు, కిష్టయ్య, బిఆర్ఎస్ జిల్లా నాయకులు సుంకరి లింగం, అర్‌సీఓ నిర్మల, పాఠశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మీ, సుజాత, ఉప సర్పంచ్‌లు శ్రీకాంత్‌రెడ్డి,అమర్, బిజెపి జిల్లా నాయకులు బిక్షపతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఖాదిర్‌ఖాన్ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలి

### -దళిత, ప్రజా సంఘాల డిమాండ్

**మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** లాకప్‌డెత్‌కు గురైన మెదక్ పట్టణానికి చెందిన ఖాదిర్‌ఖాన్ హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బహుజన ముక్తి పార్టీ, దళిత బహుజన ఫ్రంట్, లంబాడి హక్కుల పోరాటసమితి, జాతయ మాల మాహానాడు సంఘాలు డిమాండ్ చేశారు. సోమవారం బీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శులు అన్సారీ, ప్రకాష్‌రాథోడ్, డీబీఎస్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, జిల్లా అధ్యక్షులు దుబాషి సంజీవ్, జాతయ మాల మహానాడు నాయకులు కల్లూరి సంజీవ్, ప్రసాద్, ఇసాక్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు సురేష్, గోపాల్, మానవ హక్కుల వేదిక నాయకులు అహ్మద్ తదితరులు ఖాదిర్‌ఖాన్ కుటుంబాన్ని కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భం గా మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులు కొట్టి చంపేశారని వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, శంకర్ మాట్లాడుతూ ఖాదిర్‌ఖాన్‌ను హైదరాబాద్ లో పట్టుకుని ఐదు రోజుల పాటు చిత్రహింస పెట్టడం వల్ల చనిపోయినం దున పోలీసులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సస్పెండ్‌తో సరిపెట్టకుండా సర్వీసునుండి తొలగించాలని కోరారు. ఐజీ విచారణ సంఘటన వాస్తవాల ఆధారంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 లాకప్ డెత్‌లు జరిగాయన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ పేరుతో సామాన్యులను చిత్రహింసలకు గురి చేయడం తగదన్నారు. కరడుగట్టిన నేరస్థులను వదిలి దొంగతనాల పేరుతో దళిత, గిరిజన, మైనార్టీలను లాకప్‌డెత్‌లకు పాల్పడుతున్నారన్నారు. ఖాదిర్‌ఖాన్ కుటుంబాన్ని రాష్ట్ర హోంమంత్రి, ఎమ్మెల్యే కలెక్టర్‌లు పరామర్శించాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి 50 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని, ఉద్యోగం, పిల్లల చదువల బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఇల్లు లేనందున డబుల్ బెడ్‌రూం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘటనపై డీఎస్పీ సైదులుతో చర్చించారు. కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు సమర్పించి పోలీసులపై హత్య కేసు నమోదు చేయాలని, కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంజిత్, సంతోష్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల

## పరిష్కారం పిఆర్‌టియుతోనే సాధ్యం

### -రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

**వర్గల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పిఆర్‌టియుతోనే సాధ్యమని రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పిం గిళి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పిఆర్‌టియు ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డితో కలిసి వర్గల్ శ్రీ విద్యాసరస్వతీ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షా 2వేల మంది ఉపాధ్యాయులు ఉండగా 75 వేల మంది పిఆర్‌టియు సభ్యత్వం కలిగి సంస్థకు అండగా నిలిచి ఆదరిస్తున్నారని స్పష్టం చేశారు. అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా కొనసాగుతున్న పిఆర్‌టియు సమస్యల పరిష్కా రంలో ముందుండి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలు మెరుగు పరచడం, ఆత్మగౌరవాన్ని కాపాడడంలో రాజీలేని పోరాటం చేస్తున్న ఘనత దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. శ్రీ విద్యాసరస్వతీ అమ్మవారి ఆశీస్సులతో ఈనెల 23న నామినేషన్ వేయడంతో పాటు మార్చి 13న జరిగే ఎన్నికల్లో మంచి మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, వర్గల్ మండల శాఖ బాధ్యులు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నేతలు నర్సింహ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, అంజిరెడ్డి, మల్లికార్జున్, రాజు, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 90వేల మొక్కలు నాటడమే లక్ష్యం

అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌ఫౌండర్ చైర్మన్ డాక్టర్‌ప్రతాప్‌సీరెడ్డిపుట్టినరో జు వేడుకల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 90వేల మొక్కలు నాటేందుకు ఆంధ్రప్రదేవ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్తో అపోలో హాస్పిటల్స్ ఫౌండేషన్ చేతులు కలిపింది. ఈ కార్యక్రమం ద్వారా కార్బన్ జంతుజాలానికి తగిన ఆవాసాలను కల్పించడం స్థానిక కమ్యూనిటీలకు మెరుగైన గాలిని అందించడం లక్ష్యంగా చేసుకున్నారు.



హాత్ సే హాత్ జోడోపై సమీక్ష నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

## హాత్ సే హాత్ జోడోపై కాంగీల సమీక్ష

**జహీరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాల్సిన అవసరం ఉందని యువజన కాంగ్రెస్ విభాగం రాష్ట్ర ఇంచార్జి సురభి ద్వివేది అన్నారు. సోమవారం పట్టణంలోని యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షులు ఉదయ్‌శంకర్ పాటిల్, నియోజకవర్గ అధ్యక్షులు నరేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమంపై నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి బూత్ నుంచి ముబైల్ యాప్ ద్వార 5 మందిని సభ్యులను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్ల ప్రతాప్‌రెడ్డి, శివ రాథోడ్, రాష్ట్ర కార్యదర్శిలు సంతోష్ కూన, రాకేష్ శెట్కార్, శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి జహీర్, జిల్లా కమిటి సభ్యులు వజాహిద్, అక్షయ్, జాదే, మల్లికార్జున్, నరేష్‌గౌడ్, రాజు బానోత్, ఇంద్రసేన, అసెంబ్లి సభ్యులు నరేష్ బల్లు, తేజ, రాజు యాదవ్, నరేష్‌కుమార్, తిరుపతిరెడ్డి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## బర్దీపూర్ ఆశ్రమంలో బండి సంజయ్ పూజలు

**ఝురాసంగం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర రథసారధి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ సోమవారం రాత్రికి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝురాసంగం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమానికి మాజీ మంత్రి, ప్రముఖ హాస్య నటులు పి బాబుమోహన్, చంద్రశేఖర్‌లతో కలిసి ఆశ్రమానికి చేరుకున్న బండి సంజయ్‌ను పూర్ణకుంభంతో ఆశ్రమంలోకి ఆహ్వానించారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాలను, పంచ వృక్షాలను, శనేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బండి సంజయ్, బాబుమోహన్, చంద్రశేఖర్‌లను ఆశ్రమ పీఠాధిపతి అవదూతగిరి మహరాజ్, సిద్దేశ్వర స్వామిలు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యమంలో జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని నాయకులు ఘన స్వాగతం పలికారు.

## నర్సాపూర్‌లో ఖబ్రస్తాన్ స్థలం కబ్జా

### అక్రమ కట్టడాలను కూల్చి వేసిన అధికారులు

నర్సాపూర్, ఫిబ్రవరి 20.ప్రభాతవార్త:.

నర్సాపూర్ పట్టణంలో ముస్లీం మైనార్టీలకు చెందిన 531 సర్వేనెంబర్ గల కబ్రస్థాన్ స్థలం కబ్జాకు గురైంది. ఈ భూమిని కబ్జా చేసిన కబ్జాచేసిన కబ్జాదారులు ఈస్థలంలో రేకుల షెడ్డు దుకాణాలను నిర్మించారు ఈ మేరకు ఖబ్రస్తాన్ కబ్జాకు గురైన సంఘటన నర్సాపూర్ ముస్లీం మైనార్టీ సోదరులకు తెలువగా వెంటనే సోమవారం నర్సాపూర్ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ శివకుమార్ కు మున్సిపల్ కమీషనర్ వెంకట్ గోపాల్ కు, మరియు మండల తహశీల్దార్ ఆంజనేయులుకు ఖబ్రస్థాన్ స్థలం కబ్జాకు గురైందని పిర్యాధు చేశారు.ముస్లీం మైనార్టీలు ఇ,చ్చిన పిర్యాదుతో ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యు శాఖ, మున్సిపల్ శాఖ, పోలీస్ శాఖ అధికారులు తమ సిబ్బందితో స్థలాన్ని పరిశీలించారు ఈసందర్భంగా ఖబ్రస్థాన్ స్థలంలోనే ఈ రేకుల షెడ్ దుకాణాల నిర్మాణం చేశారని పేర్కొంటు ఈ రేకుల షెడ్డు దుకాణాలను జెసిబి సహాయంతో అక్రమ కట్టడాలను కూల్చి వేశారు. ఈ సందర్బంగా అధికారులు మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కబ్జాలు చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదు : ఎమ్మెల్యే

నర్సాపూర్, ఫిబ్రవరి 20 .ప్రభాతవార్త:

నర్సాపూర్ పట్టణంలో ప్రభుత్వ భూములు ఆక్రమించినట్లైతే ఎంతటి వారినైనా ఏపార్టీ వారలైనా సహించేది లేదని ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూనర్సాపూర్ పట్టణంలో ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేస్తున్నట్లు తెలిసిందన్నారు ఈసందర్భంగా నర్సాపూర్ పట్టణంలో ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లైతే పార్టీలకతీతంగా ఎంతటి వారలనైనా సహించేది లేదని కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హెచ్చరించారు ఈ ప్రభధుత్వ భూముల్లో ఎవరైన నిరుపేదలు ఉన్నట్లు గుర్తించి అర్హులైనచో వారికి వెంటనే పట్టా సర్టిఫికెట్లు ఇప్పిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ ఆంజనేయులును, మున్సిఫల్ కమీషనర్ వెంకట్ గోపాల్ లను పిలిపించి నర్సాపూర్‌లో ప్రభుత్వ భూములను గుర్తించి ఎవరెవరు కబ్జాలో ఉన్నది తెలుసుకోవాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వారిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, నాయకులు శివకుమార్, హబీబ్‌ఖాన్, పంబళ్ళ బిక్షపతి, సర్పంచ్ శ్రీరాములు, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

### -తెలంగాణ విద్యార్థి యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

హుస్నాబాద్‌టౌన్,ఫిబ్రవరి20,ప్రభాతవార్త



డిఈవోకు ఫిర్యాదు చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

హుస్నాబాద్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఆల్ఫోర్స్ పాఠశాల యాజమాన్యం ప్రచార కరపత్రాలతో పాటు హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లితండ్రులను మోసానికి గురి చేస్తున్న ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయడంతో పాటు పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కర్రె శ్రీధర్‌రెడ్డి సోమవారం రోజున సిద్దిపేట డిఈవో శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్‌లో పాఠశాల పెట్టేందుకు అనుమతి తీసు కోకుండానే యాజమాన్యం ప్రచారాలు చేస్తు విద్యార్థుల తల్లితండ్రులకు మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

### ఆల్ఫోర్స్ పాఠశాలకు ఎంఈవో నోటీస్

హుస్నాబాద్‌లో ఆల్ఫోర్స్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ఎలాంటి అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్దంగా పాఠశాల నడపడమే కాకుండా,పాఠశాల ప్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాలు పంచుతూ ప్రచారం చేయడంపై హుస్నాబాద్ మండల విద్యాధికారి దేశిరెడ్డి ఆ పాఠశాల యాజమాన్యానికి సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ విషయంపై రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పెర్కొన్నారు.

## డిఐ అజీమ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోండి

అక్కన్నపేట,ఫిబ్రవరి20,ప్రభాతవార్త

అక్కన్నపేట మండల కేంద్రంలో రైతుల భూముల కొలతల సర్వే విషయంలో అక్కన్నపేట ఎంపిటిసి పెసరు సాంబరాజు డిఐతో మాట్లాడగా తనతో అసభ్యకరంగా మాట్లాడి తన మనో భావాన్ని దెబ్బతీశారని అతనిపై జిల్లా కలెక్టర్ స్పందించి డిఐ అజీమ్‌పై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంపిటిసి సాంబరాజు సోమవారం రోజున జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కన్నపేట రైతుల సమస్యను తన దృష్టికి తీసుకురాగా ఆయనకు ఫోన్ చేశానని ఫోన్‌లో ఒక ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ఒక ప్రజా ప్రతినిధి అని చూడకుండా నానాభూతులు తిట్టి తనమనోభావాన్ని దెబ్బతీయడంతో పాటు రైతులను సైతం ఇష్టమొచ్చిన తిట్టిన ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సమగ్ర విచారణ జరిపి పట్టాలు అందించాలి

### ఎమ్మెల్యేకు విన్నవించిన భారతీయ కిసాన్ సంఘ్,బిజెపి నాయకులు

హుస్నాబాద్‌రూరల్,ఫిబ్రవరి20,ప్రభాతవార్త

హుస్నాబాద్‌లో పంపిణీకి సిద్దంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్దిదారులకు పట్టాలు ఇచ్చేముందు మరొక్కసారి సమగ్ర విచారణ చేసి పట్టాలు అందిచాలని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి,బిజెపి నాయకులు సోమవారం రోజున వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్దిదారులకు పట్టాలు ఇచ్చేముందు లబ్దిదారుల ఆస్తులు,వారి అన్నదమ్ముల ఆస్తులతో పాటు ఇదివరకు ప్రభుత్వం నుండి లబ్ది జరిగిందా అనే విషయంపై సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బోనగిరి రవి,పట్టణ కార్యదర్శి లావణ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు అన్యాయం జరిగినా పట్టించుకోరా...!?

### -సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్..

హుస్నాబాద్‌రూరల్,ఫిబ్రవరి20,ప్రభాతవార్త

ప్రభుత్వం పేదలకు అందించనున్న డబుల్ బెడ్‌రూంలలో అర్హులను అన్యాయం జరిగినా అధికారులు,నాయకులు పట్టించుకోరా అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ ప్రశ్నించారు.సోమవారం రోజున పట్టణంలోని అణభేరి సింగిరెడ్డిల అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 20వార్డుల్లో నిరుపేద కుటుంబాలకు చెందాల్సిన డబుల్‌బెడ్‌రూంలలో మున్సిపల్ పాలకవర్గం గోల్‌మాల్ చేశారని మండిపడ్డారు.లబ్దిదారుల ఎంపిక మొదటి లిస్టులో ఉన్న పేర్లు రెండవ లిస్టులో ఎందుకు రాలేదని,ఆ పేదల కడుపు కొట్టినవారెవరని వాపోయారు.ఈ విషయంపై ఎమ్మెల్యే కలెక్టర్ స్పందించి పంపిణీ చేసే డబుల్‌బెడ్‌రూంలలో అర్హులపై మరోమారు విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎడల వనేష్,అయిలేని సంజీవరెడ్డి,గూడ పద్మ,జనగాం రాజ్‌కుమార్,ఎల్లయ్య పాల్గొన్నారు.

### -సిపిఐలో చేరిన మహిళలు,యువకులు

హుస్నాబాద్ పట్టణానికి చెందిన మహిళలు,యువకులు సోమవారం రోజున ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడిపె మల్లేష్ సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మల్లేష్ పార్టీ కండువాను కప్పి స్వాగతం పలికారు.

## విగ్రహ పునః ప్రతిష్ఠపై ప్రముఖుల సమావేశం

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** 500 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయం పునః నిర్మాణం పూర్తి కానుండగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంపై పట్టణ ప్రముఖులు సోమవారం సమావేశం అయ్యారు. శ్రీ సీతారామ ఉమామహేశ్వరుల పురాతన ఆల యాన్ని సిఎం కెసిఆర్ సహకారంతో రూ.4.50 కోట్లతో పూర్తిగా రాతి కట్టడంతో నిర్మించడం జరిగిందని, విగ్రహ ప్రతిష్ఠ కోసం కొన్ని అడ్‌హక్ కమిటీలను నిర్ణయం చేయడం జరిగినట్లు తెలిపారు. ఏప్రిల్‌లో నిర్వహించ నున్న పునః ప్రతిష్ఠ కార్యక్రమ కోసం నిధి సేకరణ గురించి సభ్యులను ఎంపిక చేయడంతో పాటు ప్రతిష్టకు భాగస్వామ్య దాతలు రూ.10,116గా నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలందరినీ భాగస్వామ్యం చేయుటకు గానూ పట్టణంలో మహా హుండీని గ్రామములో తిప్పడం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఇండ్లకాడికి పోయి విద్యార్థిని పాఠశాలకు పంపాలని సూచిస్తున్న ఎంఇఓ అంజయ్య దృశ్యం

## 10 విద్యార్థులు 100 శాతం హాజరుకావాలి

### -ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులతో ఎంఇఓ అంజయ్య

**పుల్కల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** 10వ తరగతిలో విద్యను ఆర్జిస్తున్న ప్రతి విద్యార్థి విధిగా నిత్యం పాఠశాలకు హాజరుకావాలని ఎంఇఓ డి అంజయ్య సూచించారు. సోమవారం మండలంలోని సింగూరు జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి ప్రత్యేక తరగతులను, ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కారర్యక్రమాన్ని పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థి ప్రసాద్ గత ఆరు మాసాలుగా పాఠశాలకు రావడం లేదని తెలుసుకున్న ఎంఇఓ విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో చర్చించారు. పరీక్షలకు 42 రోజులే సమయం ఉన్నందున విద్యార్థులకు రెగ్యూలర్ తరగతులతో పాటు ప్రత్యేక తరగతులకు విధిగా హాజరు కావాలని అందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ వంతు చర్యలు తీసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, దయాకర్ , సిఆర్‌పి మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూహెచ్ డైరీని ఆవిష్కరించిన వైస్ ఛాన్సలర్



జేఎన్‌టీయుహెచ్‌లో డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్ట నరసింహారెడ్డి

**పుల్కల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** జేఎన్టీయుహెచ్ జేఏసి ఆధ్వర్యంలో సోమవారం జేఏసి డైరీని, నూతన సంవత్సర కార్యలెండర్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్ట నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఎన్టీయుహెచ్ జేఏసి చైర్మన్ బొట్ల భిక్షపతి, అధ్యక్షులు మంద రంజిత్‌కుమార్‌లు మాట్లాడుతూ డైరీలో రాజ్యాంగం ప్రాథమిక హక్కులు, దేశ, రాష్ట్ర స్థాయిలో యూజీసీ గుర్తింపు పొందిన మెడికల్, ఇంజనీరింగన యూనివర్సిటీ వివరాలు ఎఐసిటీఈ, న్యాక్, ఎన్బీఏ సంబంధిత సమచారం, తెలంగాణలో గుర్తింపు పొందిన ప్రభుత్వ యూనివర్సిటీల, ప్రయివేటు యూనివర్సిటీల వివరాలు ఉన్నాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎ గోవర్ధన్, కళాశాల ప్రిన్సిపాల్ ఏ జయలక్ష్మి, వైస్ చైర్మన్ ధరమ్‌సొత్తు, శ్రీనివాస్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గర్ సందీప్, ప్రణయ్, సాయిశరత్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాభివృద్ధికి దాత విరాళం

**ఝురాసంగం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండలంలోని కుప్పనగర్ గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయ అభివృద్దికి జిన్నారం మండల వాసి ఆర్థిక సహాయం అందచేశారు. జిన్నారం మండలం మాచారం గ్రామానికి చెందిన నర్సింలు తన వంతుగా 5వేల రూపాయలను ఆలయ ధర్మకర్త జి యాదయ్యకు అందచేశారు. అంతుకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఆంజనేయులు గౌడ్, యాదగిరి, శంముని జగ్గు, ఢిల్లీ రాములు తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

### ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడి

చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:

ఆలయాలలో దూప దీప నైవేద్యాలు అనివార్యమని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేట పట్టణంలోని శ్రీ సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో మూడవరోజు బోనాలు కారక్యమం నిర్వహించగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బోనం ఎత్తుకోని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పురాతన ఆలయాన్ని అభివృద్ది చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామినిచ్చారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ఆలయాల అభివృద్దికి పెద్ద పీట వేశారని, భారాస పాలనలో పూరతన ఆలయాలు అభివృద్ది చెందాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు మాదవి, బారాస పార్టీ మండల అధ్యక్షుడు రాజు, రైతు బంధు మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పూలపల్లి యాదగిరి, సర్పంచి రాజిరెడ్డి, మాజి సర్పంచ్ కుమార్‌గౌడ్, ఉప సర్పంచి జివన్, పాలక వర్గం సభ్యులు, ఆలయ అభివృద్ది కమిటి సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైఎస్సార్ తెలంగాణ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

### రాష్ట్ర నాయకులు గట్టు రాంచందర్‌రావు

నర్సాపూర్, ఫిబ్రవరి 20.ప్రభాతవార్త:.

వైఎస్సార్ తెలంగాణ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్ రాష్ట్ర నాయకులు గట్టు రాంచందర్‌రావు అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని క్లాసిక్ గార్డెన్ లో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి గౌరిగారి ఆగమయ్య అద్యక్షత వహించగా వైఎస్సార్ పార్టీ రాష్ట్ర నాయకులు గట్టు రాంచందర్‌రావు, పిట్ట రాంరెడ్డి కవిత, నీలం రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర నాయకులు గట్టు రాంచందర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ జెండాలను ఆవిష్కరించాలన్నారు. గ్రామాగ్రామాన కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్తకృషి చేయాలన్నారు. 100 రోజుల్లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయని ఈ నేపథ్యంలో వైఎస్సార్ తెలంగానా పార్టీని గ్రామగ్రామాన పటిష్ట వంతం చేసి మన ఉనికి ని చాటాలన్నారు.ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి వైఎస్సార్ తెలంగాణ పార్టీని భలోపే తం చేయడం కోసం కంకణ బద్దులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలోవైఎస్సార్ తెలంగాణ పార్టీ ముఖ్య కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

### -ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**మెదక్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకుముందు దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సోమవావతి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించిన అర్చకులు శంభీపూర్ రాజుకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట శివ్వంపేటె పంపీపీ అధ్యక్షులు కల్లూరి హరి కృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.